క్లుప్తంగా

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకం నిర్వహించారు.

దీక్షలు విరమించిన ఆర్టీసీ ఉద్యోగులు



దీక్షల విరమణ తర్వాత టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆర్టీసీ ఉద్యోగులు

అల్లిపురం : వారం రోజులుగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్షలను ఆర్టీసీ ఉద్యోగులు శనివారం విరమించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు, వాల్తేరు డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు కార్మికులతో దీక్షలు విరమింపజేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో ఎన్ఎంయూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను పోలీసులు శనివారం ఉదయం భగ్నం చేశారు. దీక్షలో పాల్గొన్న వారిని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఉద్యోగులు పోలీస్ స్టేషన్‌లోనే తమ దీక్ష కొనసాగించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుద్ధ్య కార్మికుల ఐరిస్ పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. శనివారం ఆయన జోన్ పరిధి 35వ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల ఐరిస్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడుతూ జోన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు అందరు ఉదయం ఆరు గంటలకు విధుల్లో చేరాలన్నారు. రోడ్లు, కాలువలు, గెడ్డలు, సులభ్ కాంప్లెక్స్‌లు పరిశుభ్రం చేయాలన్నారు. అదే విధంగా క్లాప్ వాహనాలకు తడిపొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. రోడ్డు, వీధుల్లో చెత్త లేకుండా పరిశుభ్రం చేయాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులందరూ విధిగా జీవీఎంసీ ఇచ్చిన యూనిఫారం ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, శ్రీను, సెక్రటరీ కోటి తదితరులు పాల్గొన్నారు.

బండెనక బండి కట్టి..



పూర్ణామార్కెట్ వద్ద నినాదాలు చేస్తున్న అభిమానులు, కార్యకర్తలు

- సీఎం భీమిలి సభకు తరలి వెళ్లిన అశేష పార్టీ శ్రేణులు
- మేము సైతం 'సిద్ధం' అంటూ కదనోత్సాహం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భీమిలిలోని సంగివలసలో పూరించిన ఎన్నికల శంఖారావ సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ స్థాయిలో తరలి వెళ్లారు. నియోజకవర్గం పరిధి పలు ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై చీమల బారును తలపిస్తూ పయనమయ్యారు. దీంతో దారులన్నీ భీమిలి వైపే సాగాయి. నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు, అభిమానులకు దిశా నిర్దేశం చేస్తూ ఉత్సాహంగా అందరినీ తీసుకుని సీఎం సభాస్థలికి బయలుదేరి వెళ్లారు.

అల్లిపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికలకు 'సిద్ధం' అంటూ భీమిలిలో పూరించిన ఎన్నికల శంఖారావ సభకు ఉత్తరాంధ్ర నుంచి శనివారం మేము సైతం 'సిద్ధం' అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. 32, 33, 34 వార్డుల నుంచి ఉల్లాసంగా, ఉత్సాహంగా కదిలారు.



34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో బయలుదేరిన పార్టీ శ్రేణులు

- 33వ వార్డు నుంచి మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేటి ప్రసాద్ సారథ్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు బయలుదేరి వెళ్లారు. నీలమ్మ వేప చెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు సభకు బయలుదేరారు.
- 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో వార్డు కార్యకర్తలు, అభిమానులు మనోరమా థియేటర్ వద్ద నుంచి పయనమయ్యారు. సభకు తరలి వెళ్లిన వారిలో వార్డు ఇన్‌చార్జి సనపల రవీంద్ర భరత్, సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

30వ వార్డు నుంచి.

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డు నుంచి సీఎం సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభించారు. జగదాంబ జంక్షన్ నుంచి బయలుదేరిన పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం, పార్టీ వార్డు ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, నాయకులు దశమంతుల చిన్న, దశమంతుల మాణిక్యాలరావు తదితరులు ఉన్నారు.



కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో సీఎం సభకు తరలి వెళ్తున్న పార్టీ శ్రేణులు

35వ వార్డు నుంచి..

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భీమిలి సభకు జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. సీఎం సభాస్థలికి వెళ్లేందుకు నాయకులు అయిదు బస్సులు ఏర్పాటు చేశారు. సభకు తరలి వెళ్లే ముందు అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు వార్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికలకు సిద్ధం కావాలంటూ నినాదాలు చేశారు. వాసుపల్లిని ఎమ్మెల్యేగా గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్న నినాదంతో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఆదివిష్ణు, సుబ్రహ్మణ్యం, రమణమ్మ, రమణ, పుష్ప, గంగాధర్, నాయిని పాట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజన్న ఆటో యూనియన్ ఆధ్వర్యంలో..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన ఎన్నికల శంఖారావ సభకు జీవీఎంసీ 35వ వార్డు నుంచి రాజన్న ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీగా అభిమానులు, పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు పటాన్ కాజువల్ ఆధ్వర్యంలో 2500 మంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికలకు సిద్ధం కావాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దారులన్నీ భీమిలి వైపే..

డాబాగార్డెన్స్: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి భీమిలి సంగివలసలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శనివారం 'సిద్ధం' పేరిట పూరించిన ఎన్నికల శంఖారావానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. నియోజకవర్గం 13 వార్డుల నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో వీరంతా సంగివలస 'సిద్ధం'కు సంఘీభావంగా స్వచ్ఛందంగా బయలుదేరారు. నియోజకవర్గ పరిధి 27వ వార్డు నుంచి వార్డు ఇన్‌చార్జి సీలాపు సర్వేశ్వరరెడ్డి (7 బస్సులు), 29వ వార్డు నుంచి మండల అధ్యక్షుడు పీతల వాసు (7 బస్సులు), 30వ వార్డు నుంచి ఆ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం (6 బస్సులు), 31వ వార్డు నుంచి ఆ వార్డు ఇన్‌చార్జి దొడ్డి బాపూ ఆనంద్ (7 బస్సులు), 32వ వార్డు నుంచి మూలే రామిరెడ్డి (7 బస్సులు), 33వ వార్డు నుంచి పచ్చిరపల్లి రాము (7 బస్సులు), 34వ వార్డు నుంచి ఆ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి (6 బస్సులు), 35వ వార్డు నుంచి అలపున కనకరెడ్డి (7 బస్సులు), 36వ వార్డు నుంచి మాసిపోగు రాజు (6 బస్సులు), 37వ వార్డు నుంచి నొల్లు పోతుస్వామి (6 బస్సులు), 38వ వార్డు నుంచి సంకాబత్తుల సన్యాసిరావు (7 బస్సులు), 39వ వార్డు నుంచి మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం (7 బస్సులు), 41వ వార్డు నుంచి కోడిగుడ్ల శ్రీధర్ (7 బస్సులు), పార్టీ నాయకుడు పాపారావు (3 బస్సులు) ఆధ్వర్యంలో వీరంతా సంగివలసకు తరలి వెళ్లారు. వీరితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కార్లలో వెళ్లారు.



జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న కొడూరు అప్పలరత్నం



పీతల వాసు నేతృత్వంలో జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి తరలి వెళ్తున్న అభిమానులు



35వ వార్డు నుంచి ర్యాలీగా వెళ్తున్న అభిమానులు, నాయకులు, కార్యకర్తలు



మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం నేతృత్వంలో బయలుదేరిన పార్టీ శ్రేణులు



మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



బొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న కార్యకర్తలు, నాయకులు

విశాఖ ఉక్కు అమ్మకం నిర్ణయం విరమించుకోవాలి



మాట్లాడుతున్న సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

డాబాగార్డెన్స్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను శతశాతం అమ్మాలని తప్పుడు నిర్ణయం తీసుకుందన్నారు. అప్పటి ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు సాగుతున్నాయన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం నేటికీ తన నిర్ణయాన్ని ఉపసంహరించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయని చెప్పారు. రాష్ట్రంలోని గనుల లీజులు పునరుద్ధరించకుండా కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. సముద్రతీరంలో ఉన్న ఏకైక భారీ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే దీనికి సరైన పరిష్కారంగా పేర్కొన్నారు. సమావేశంలో సిటు జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ సిటు ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి పాల్గొన్నారు.

అభాగ్యునికి ఆశ్రయం



అభాగ్యుడిని తరలిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి వాసు

అల్లిపురం : దీనస్థితిలో ఉన్న అభాగ్యునికి భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం ప్రతినిధులు ఆశ్రయం కల్పించారు. పీఎం పాలెం లోని దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి ఎప్పటి నుంచో దయనీయ స్థితిలో ప్లాస్టిక్ బ్యానర్ల కింద ఉంటున్నాడని ఆరిలోవ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ హరినారాయణ వసతి గృహానికి సమాచారం అందజేశారు. దీంతో గృహ ప్రతినిధి ప్రగడ వాసు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. దుర్గంధంతో ఉన్న అతనికి స్నానం చేయించి బట్టలు మార్చి, భోజనం పెట్టి షెల్టర్‌కు తీసుకువచ్చారు. అతనికి సపర్యలు చేసిన తర్వాత అతని పేరు జోగులు రాంబాబు అని, తనది ఏలూరి అని చెప్పాడని తెలిపారు. అతనికి చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

దేవాలయాలపై అధ్యయన వివరాలు నేడు వెల్లడి

- ఏయూలో సమావేశం

మహారాణిపేట : ప్రఖ్యాత సినీ గేయ రచయిత, తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నేతృత్వంలో కొంత మంది భక్త చైతన్యవంతుల బృందం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల చరిత్రలను అధ్యయనం చేస్తోంది. పలు దేవాలయాల నిర్మాణం వెనుక పెద్దల కృషి, దాతల దాతృత్వం, దేవాలయాలకు సంక్రమించిన ఆస్తులు, వాటి నిర్వహణ తీరులో జరుగుతున్న అపచారాలు, కావాలని దేవాలయాల ఆస్తులను కొల్లగొడుతున్న తీరు తెన్నులు, కైంకర్యమైపోతున్న దేవాలయాల ఆస్తిపాస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం తమ అధ్యయన విశేషాలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా ఆదివారం సాయంత్రం మద్దిలపాలెం జంక్షన్ సమీపంలో గల డాక్టర్ వైఎస్ఆర్ మూర్తి ఆడిటోరియంలో ఒక సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ పూర్వ ముఖ్య కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథులుగా విజయ్ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రఖ్యాత పద్యకవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితులు పీటీజీవి రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్టు జీవీఎస్ మూర్తి పాల్గొంటారు. సూరంపూడి వీరభద్రరావు సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి పతంజలి యోగా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వేదభాస్కరం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఘట్టి శ్రీ విద్య బృందంచే భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అర్చకులు అంతా తరలి రావాలని ఉత్తరాంధ్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తలంక మురళీకృష్ణ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సత్కారం



డాక్టర్ భారతిని సత్కరిస్తున్న ఆస్పత్రి కమిటీ ప్రతినిధి రమణబాబు

అగనంపూడి: ఉత్తమ సేవలు అందిస్తున్న అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందించి గౌరవించడం సంతోషంగా ఉందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతిని కమిటీ ప్రతినిధులు శనివారం ఘనంగా సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



సదస్సులో పాల్గొన మార్వాడీ సమాజ్ మహిళలు

అల్లిపురం : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు అఖిల భారత మార్వాడీ సమాజ్ సంఘం కృషి చేస్తుందని సంఘం జాతీయ అధ్యక్షురాలు నీరు తెలిపారు. నగరంలో ఒక హోటల్లో శనివారం విశాఖ నగరంలోని మహారాష్ట్ర మండల్ నేషనల్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గ్రామస్థాయి నుంచి ప్రజలకు సామాజిక సేవ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ప్రతి ఏటా రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా మార్వాడీ మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుంచి మహిళలు, సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టెక్ ఫెస్ట్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా శనివారం నిర్వహించిన టెక్ ఫెస్ట్, మోడల్ ఎక్స్‌పో ఆకట్టుకున్నాయి. సివిల్, సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, బీఎస్ అండ్ హెచ్ అన్ని సాంకేతిక విభాగాలు అనేక నమూనాలు ప్రదర్శించాయి. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ప్రిన్సిపాల్స్‌తో ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈఈఈ విభాగం విద్యార్థులు తయారు చేసిన ఇంగ్లిష్ క్లాస్‌రూమ్, ఎలక్ట్రిక్ కార్‌ను ఆయన ప్రారంభించి అభినందించారు. పలు పాఠశాలలు, ఇంటర్ కళాశాల విద్యార్థులు పాల్గొని నమూనాలు తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

1080వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: మహోన్నతమైన భారత రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు శనివారానికి 1080వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా 'పరిచయ్'



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కిమ్స్ ఐకాన్ సీవోవో సుఖేష్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లో బొల్లినేని మెడ్ స్కిల్స్ పీజీ విద్యార్థుల పరిచయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కల్చరల్ ఫెస్ట్‌ను కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆర్‌సీవోవో డాక్టర్ జి.బాలాజీ, సీవోవో జి.సుఖేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీవోవో మాట్లాడుతూ టైమ్ మేనేజ్‌మెంట్, ఆస్పత్రి రంగంలోని ఉపాధి అవకాశాలను విద్యార్థులకు వివరించారు. బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో నిర్వహిస్తున్న హెల్త్ కేర్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఏ, పీజీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కిమ్స్ ఐకాన్ క్రిటికల్ కేర్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ రవి కృష్ణ, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ చాణక్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు వికీపీడియా వార్షికోత్సవం



మెడలో వికీపీడియా కండువాలతో సభ్యులు

డాబాగార్డెన్స్ : అంతర్జాల విజ్ఞాన సర్వస్వమైన తెలుగు వికీపీడియా వార్షికోత్సవం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ విజ్ఞాన సృష్టి పేరుతో ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో వికీపీడియా సభ్యులు ఎం.వి. నాయుడు, డాక్టర్ మామిడి హరికృష్ణ, ఆదిత్య కందర్ప, కాకర్ల సజయ తదితరులు పాల్గొని తెలుగులో విజ్ఞానం అందించడంపై చర్చించారు. విజ్ఞానానికి పరిధులు లేవని, అది ఎప్పటికీ మార్పు చెందదన్నారు. తెలుగు సాహిత్యాన్ని భద్రపరిచే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు వికీపీడియా సభ్యులు తుమ్మల శిరీష్‌కుమార్, రాజశేఖర్, వీనస్, పవన్ సంతోష్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



జయప్రభాశర్మను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ద్వారా ప్రజలకు విశేష సేవలందించిన క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభ శర్మను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వనితా భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చేసిన సేవలను సభ్యులు కొనియాడారు. తనను సత్కరించిన సభ్యులకు ప్రభాశర్మ కృతజ్ఞతలు తెలిపారు. వైశాఖీ స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, పొందూరి ప్రభావతి పాల్గొన్నారు.